సాక్షి
ఆదిలాబాద్

బుధవారం : 7 : ఫిబ్రవరి : 2024



ఓవర్ టు మర్రిచెట్టు..

నాగోబా జాతరలో భాగంగా మెస్రం వంశీయులు ఇప్పటికే కేస్లాపూర్ పొలిమేరలోని మర్రి చెట్టు వద్దకు చేరారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

8లో▸

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఎదులాపురం: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో వెంటనే ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. ఇందులో జిల్లా అధికార ప్రతినిధి నక్క రాందాస్, కోశాధికారి ప్రసన్నకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రలు పెరగనున్నాయి. ఉక్కపోత మరూ కానుంది.

న్యూస్‌రీల్

లైంగిక వేధింపుల చిత్రాలు బహిర్గతం చేయొద్దు



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు, చిన్నపిల్లలపై జరిగిన లైంగిక వేధింపుల చిత్రాలు, వీడియోల ను బహిర్గతం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ గౌస్ ఆలం ప్రకటనలో హెచ్చరించారు. మెసేజీలు ఫార్వర్డ్ చేసిన వాట్సప్ గ్రూప్ అడ్మిన్, గ్రూప్ సభ్యులపై సైతం చర్యలు తప్పవని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహిళలు, చిన్నపిల్లలకు సంబంధించిన లైంగిక వేధింపుల వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టరాదని స్పష్టం చేశారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని తెలిపారు. పోక్సో చట్టం ప్రకారం ఇలాంటి సున్నితమైన అంశాలలో తలదూర్చినా, పనులు చేసినా శిక్షార్హులవుతారని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలో జిల్లా విద్యార్థి ప్రతిభ



సెహ్వాగ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: జాతీయస్థాయి షూటింగ్‌బాల్‌లో జిల్లా విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. ఆంధ్రప్రదేశ్‌లోని చీరాలలో నిర్వహించిన జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలో ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సెహ్వాగ్ తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ అచ్చి శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ అనిత, లెక్చరర్లు, విద్యార్థులు అభినందించారు.

పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నవీన్

ఆదలాబాద్‌టౌన్: పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నర్ర నవీన్‌యాదవ్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి నియమించారు. మంగళవారం హైదరాబాద్‌లో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో యూనియన్ చేరారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని, తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి బాలాజీ, జిల్లా అధ్యక్షుడు నూర్‌సింగ్, జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

23మంది జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో మరో 23 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) రెగ్యులరైజేషన్ పూర్తయింది. రాష్ట్ర వ్యాప్తంగా 455మంది జేపీఎస్‌లను ప్రభుత్వం గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా జిల్లా నుంచి 23 మందికి అవకాశం లభించింది. రెగ్యులరైన జేపీఎస్‌లు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పేద పిల్లల కోసం 565 నోట్ బుక్స్, 500 పెన్నులను ఎమ్మెల్యేకు అందజేశారు.

'గృహజ్యోతి'కి వివరాలు అందించాలి

కైలాస్‌నగర్: గృహజ్యోతి పథకం కింద జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందేందుకు తమ వివరాలు అందించాలని ఆ శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ జేఆర్ చౌహాన్ ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి స్పాట్ బిల్లర్స్ ఇంటింటికి తిరుగుతూ మీటర్ రీడింగ్ తీయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు తమ రేషన్, ఆధార్, ఫోన్ నంబర్లను తప్పనిసరి చూపించాల్సి ఉంటుందని తెలిపారు. అద్దె ఇంట్లో నివసించే వినియోగదారులు కూడా అర్హులేనని, వారు కూడా విధిగా వారి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్ ఇంటి సర్వీస్ నంబర్‌కు లింక్ చేయించాలని పేర్కొన్నారు. ఇంటికి సంబంధించిన ఓనర్ షిప్ మారదని, ఒకవేళ మీరు ఇంటి వద్ద లేకుంటే పేపర్‌పై వివరాలు రాసి మీటర్ వద్ద ఉంచాలని సూచించారు.

ప్రగతి నివేదికలు అందజేయాలి

కైలాస్‌నగర్: జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాల నిర్వహణ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు తమ ప్రగతి నివేదికలను ఈ నెల 15 లోగా కార్యాలయంలో అందజేయాలని జెడ్పీ సీఈవో గణపతి ప్రకటనలో తెలిపారు. ప్రగతి నివేదికలను ఏ4 సైజ్ ప్రతుల్లో అందజేయాలని పేర్కొన్నారు.



మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసే ఫిల్టర్‌బెడ్

గొంతెండుడేనా!

- ఎండలు ముదరక ముందే నీటి ఇక్కట్లు
- సగమే అందుతున్న మిషన్ భగీరథ నీరు
- 21 వార్డులకు రోజు విడిచి రోజు సరఫరా
- ముందస్తు చర్యలు చేపట్టని బల్దియా
- వేసవిలో నీటి కష్టాలు పెరిగే అవకాశం

పట్టణంలో..
వార్డులు : 49
జనాభా : 1, 80,390
కుటుంబాలు: 48,393
నల్లా కనెక్షన్లు : 35వేలు
అవసరమైన నీరు: 30.67 ఎంఎల్‌డీ
ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు : 15 ఎంఎల్‌డీ
చేతి పంపులు : 975
మంచి నీటి ట్యాంకులు : 60

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ వాసులకు ఈ వేసవిలో తాగునీటి కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటర్‌గ్రిడ్ నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా కావడం లేదు. దీంతో పట్టణంలోని పలు వార్డులకు ఇప్పుడే రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం సమస్య అంతగా లేనప్పటికీ ఎండలు ముదిరితే ఇక్కట్లు తప్పకపోవచ్చు. నీటి ఎద్దడి నివారణ దిశగా బల్దియా యంత్రాంగం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టపోవడం గమనార్హం.

డిమాండ్‌లో సగమే సరఫరా

గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీకి మిషన్ భగీరథ ద్వారా నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం మటేగాం పంప్‌హౌస్ నుంచి నీరు సరఫరా అవుతుంది. పట్టణ ప్రజల అవసరాల మేరకు నిత్యం 30.67 మిలియన్ లీటర్ల నీరు అవసరం. ఇందులో ప్రస్తుతం రోజుకు 15 మిలియన్ లీటర్ల నీటిని మాత్రమే భగీరథ అధికారులు సరఫరా చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా బల్దియా అధికారులు లాండసాంగ్వీ పంప్‌హౌస్ నుంచి 6 మిలియన్ లీటర్లు, మావల చెరువు నుంచి 1 మిలీయన్ లీటర్ల నీటిని పట్టణంలోని ఫిల్టర్‌బెడ్, ట్యాంక్‌లకు తరలించి స్టోర్ చేస్తున్నారు. వాటి ద్వారా ఆయా వార్డుల పరిధిలోని కుళాయిలకు సరఫరా చేస్తున్నారు. పట్టణంలో 49 వార్డులుండగా ప్రస్తుతం 20 వార్డులకు నిత్యం నీటిని సరఫరా చేస్తుండగా మిగతా వార్డులకు రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు.

ఎండలు ముదిరితే..

ప్రస్తుతం రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేసినా ఇప్పటి వరకు ఎలాంటి సమస్య లేదు. ఎండలు ముదిరితే మాత్రం పరిస్థితి జఠిలంగా మారే అవకాశం ఉంది. పట్టణానికి అవసరమైన నీటి సరఫరా మిషన్ భగీరథ నుంచి పూర్తి స్థాయిలో కావడం లేదు. ఎండల తీవ్రత కారణంగా మావల నుంచి సరఫరా నిలిచిపోయే అవకాశముంది. ఇదే జరిగితే పట్టణ వాసులకు నీటి ఇక్కట్లు తీవ్ర రూపం దాల్చే పరిస్థితి ఏర్పడనుంది. మరోవైపు బల్దియా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారించేలా కార్యాచరణను ముందస్తుగా సిద్ధం చేయాల్సిన అధికారులు ఇప్పటి వరకు ఆ దిశగా దృష్టి సారించకపోవడం గమనార్హం.

వృథాకు అడ్డుకట్టేది?

వాటర్ గ్రిడ్ నుంచి సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీరు పైపులైన్ లీకేజీల రూపంలో వృథాగా పోతుంది. నిత్యం ఎక్కడో ఓ చోట పైపులైన్ పగలడం, లీకేజీలు ఏర్పడుతున్నాయి. వాటిని సకాలంలో మరమ్మతు చేపట్టకపోవడం కూడా నీటి వృథాకు కారణమవుతుంది. దీనికి తోడు పట్టణంలోని పలు కాలనీల్లో బిగించిన కుళాయిలకు ఆఫ్ ఆన్‌లను ఏర్పాటు చేయలేదు. నీటి వృథాకు అడ్డుకట్ట వేయాల్సిన మున్సిపల్ అధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

నీటి సమస్య తలెత్తకుండా చూస్తాం



పట్టణానికి అవసరమైన నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను కోరుతున్నా వారు పట్టించుకోవడం లేదు. దీంతో సగంనీరు మాత్రమే సరఫరా అవుతుంది. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా లాండసాంగ్వీ నుంచి నీటిని తీసుకుంటున్నాం. వేసవిలో తాగునీటి ఇక్కట్లు తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తాం. – తిరుపతి, మున్సిపల్ ఇంజినీర్

సీసీ రోడ్లు.. 'హస్త'గతం!

- ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనులు..
- అధికంగా కాంగ్రెస్ శ్రేణులకే దక్కే అవకాశం
- బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కూడా..
- ఇన్‌చార్జి మంత్రి ద్వారా నియోజకవర్గాల్లో ప్రతిపాదనలు
- కలెక్టర్ ఆమోద ముద్ర.. ఆపై పనులు ప్రారంభం



నేరడిగొండ మండలంలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం (ఫైల్)

సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి వివరాలు..
కేటాయించిన ఉపాధిహామీ నిధులు: రూ.30.76 కోట్లు
మొత్తం పనులు: 516
ఇప్పటివరకు ఆమోదం లభించినవి: రూ.28.68 కోట్లు
ఆదిలాబాద్ నియోజకవర్గం: రూ.5.50 కోట్లు
బోథ్ నియోజకవర్గం:రూ.13.18 కోట్లు
ఖానాపూర్ నియోజకవర్గం (ఉట్నూర్, ఇంద్రవెల్లి) : రూ.8 కోట్లు
ఆసిఫాబాద్ నియోజకవర్గం(నార్నూర్, గాదిగూడ):రూ.2 కోట్లు

సాక్షి,ఆదిలాబాద్: ఉపాధి హామీ నిధులతో చేపట్టే సీసీ రోడ్ల పనులు అధికంగా కాంగ్రెస్ శ్రేణులకే దక్కే అవకాశం ఉంది. జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వారా నియోజకవర్గాల్లో అధిక మొత్తం నిధులతో వర్క్స్‌కు ప్రతిపాదనలు రూపొందించడం ద్వారా అందులో సగానికి పైగా హస్తం పార్టీ కార్యకర్తలకే దక్కనున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రపోజల్స్‌కు కూడా ఆమోదం లభించింది. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండగా, దాని పరిధిలోని ఉట్నూర్, ఇంద్రవెల్లిలో నిధులు ఎక్కువగా కేటాయించారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండడంతో..

ఏటా వార్షిక సంవత్సరం ముగింపునకు చేరువలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ ద్వారా నిర్మించే సీసీ రోడ్ల సందడి గ్రామాల్లో మొదలవుతుంది. ఇదివరకు బీఆర్ఎస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండడంతో పనుల పంపకాల్లో అంతగా సమస్య కనిపించలేదు. ఈ ఏడాది రూ.30.76 కోట్లతో అధికంగా సీసీ రోడ్లు, కొన్నిచోట్ల మురుగుకాల్వల నిర్మాణం చేపట్టబోతున్నారు. దీనికి సంబంధించి ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపాదనలు స్వీకరించారు. అయితే జిల్లాలోని ఆదిలాబాద్‌లో బీజేపీ, బోథ్, ఆసిఫాబాద్‌లలో బీఆర్ఎస్, ఖానాపూర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఖానాపూర్‌లో అధికార పార్టీ నుంచే ప్రతిపాదనలు రూపొందుతాయి కాబట్టి అక్కడ కాంగ్రెస్ శ్రేణులకే పనులు దక్కే అవకాశం ఉంటుంది. అయితే సమస్య వచ్చిందల్లా ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్‌లలోనే. దీంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వారా ప్రధానంగా బోథ్‌లో అధిక పనులు, నిధులు కేటాయించేలా ప్రతిపాదనలు రూపొందాయి.

కేటాయింపులు ఇలా..

ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. బోథ్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రతిపాదనలకు అనుగుణంగా సుమారు రూ.6.50 కోట్ల నిధుల కేటాయింపు జరిగింది. ఇదే నియోజకవర్గంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వారా రూ.7 కోట్లకు పైగా నిధుల కేటాయింపు పూర్తయింది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని జిల్లా పరిధిలోకి వచ్చే నార్నూర్, గాదిగూడకు రూ.2 కోట్లు కేటాయించడం జరిగింది. ఇక ఖానాపూర్ నియోజకవర్గంలోని జిల్లా పరిధిలోకి వచ్చే ఉట్నూర్, ఇంద్రవెల్లికి సంబంధించి జిల్లాలోని అత్యధికంగా నిధులు కేటాయించారు. ఇక ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు ప్రతిపాదనలకు కూడా స్వల్పంగా రూ.2 కోట్ల నిధులు కేటాయించారు. అన్నింటికి సంబంధించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వారా ప్రతిపాదనలు కలెక్టర్‌కు చేరగా, వాటికి అధికార ఆమోద ముద్ర పడింది. కాగా ఈ పనులను ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో ప్రారంభించారు. మొత్తంగా ఉపాధిహామీ నిధులతో చేపట్టే ఈ పనులను వార్షిక సంవత్సరం చివరిలో అంటే.. మార్చి 31లోగా ఇవి పూర్తి కావాలి. అప్పటివరకు ఈ పనులు పూర్తయి నిధుల వినియోగం జరిగిపోవాలి.

సమన్వయంతో పని చేయాలి

- నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మావల మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సర్పంచుల పదవీకాలం ముగిసినందున జిల్లాలోని 468 జీపీలకు మండల స్థాయి అధికారులను స్పెషలాఫీసర్లుగా నియమించామన్నారు. ఆయా పంచాయతీల్లో ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతీ ఇంటికి తాగునీరు అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. నిత్యం పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించాలన్నారు. అలాగే హరితహారం కింద నాటిన మొక్కలను రక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటును పర్యవేక్షించాలన్నారు. ప్రతి రెండు నెలలకు జరిగే గ్రామ సభలకు ప్రత్యేక అధికారులు అధ్యక్షత వహించి ఆదాయ వ్యయాలపై సమీక్షించాలన్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపొందించి ఈ–గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 28 వరకు వంద శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీల్లో అక్రమ వెంచర్ల ఏర్పాటుపై దృష్టి సారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- లేకుంటే గ్రామాల్లో తిరగనివ్వం
- యూత్ కాంగ్రెస్ హెచ్చరిక



బాల్క సుమన్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆయన్ను గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. సీఎంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌక్‌లో బాల్క సుమన్ చిత్రంతో కూడిన ఫ్లెక్సీని మంగళవారం దహనం చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల గురించి సుమన్ ఏనాడు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇసాక్ షేరూ, నాహిద్, శ్రీధర్, రూపేష్‌రెడ్డి, మోసిన్ పటేల్, అర్బాత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకెంత కాలం?

- టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూపు
- పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్
- తక్షణమే నోటిఫికేషన్ ప్రకటించాలి
- నేడు విద్యాశాఖ కార్యాలయ ముట్టడికి పిలుపు
- హైదరాబాద్‌కు తరలివెళ్తున్న అభ్యర్థులు



నిర్మల్‌లో ధర్నా చేస్తున్న అభ్యర్థులు

గత నోటిఫికేషన్ ఖాళీలు ఇలా...

జిల్లా	ఎస్ఏ	ఎస్జీటీ	ఎల్‌పీ	పీఈటీలు	మొత్తం
ఆదిలాబాద్	54	206	13	02	275
కుమురంభీం	49	214	24	02	289
మంచిర్యాల	36	58	16	03	113
నిర్మల్	16	91	04	04	115

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2017లో ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీచేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ డీఎస్సీ నిర్వహించలేదు. అప్పుడు 8,792 ఖాళీలతో నోటిఫికేషన్ విడుదల చేసి ఎంపికైన అభ్యర్థులకు 2019లో నియామకాలు కల్పించింది. అప్పటినుంచి ఏడేళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాల కోసం నిరీక్షించారు. రెండు నెలలుగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతూ విజ్ఞప్తులు చేశారు. ధర్నాలు, రాస్తారోకోలతో డిమాండ్ వినిపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈనెల 7న హైదరాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ ఎక్కువ ఖాళీలతో విడుదల చేయాలని కోరుతున్నారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల వారీగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య తక్కువ ఉందని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఖాళీలు పెంచాలంటున్న అభ్యర్థులు

ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు గతంలో వెలువరించిన నోటిఫికేషన్‌కు మరిన్ని పోస్టులు కలిపి అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు. ఈ నోటిఫికేషన్‌లో ఎస్జీటి, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, పండిట్ తదితర టీచర్ల ఖాళీలను గతంలో ఉన్న వాటి కంటే పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతున్నారు. ఇదే అంశంపై జిల్లాకు చెందిన డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం నాయకులు జిల్లావిద్యాశాఖాధికారి కార్యాలయంలో పలుమార్లు వినతిపత్రం అందజేశారు. అయితే ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్లకు పీజీహెచ్ఎంలుగా ప్రమోషన్లు ఇవ్వడంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే క్రమంలోనే కోర్టు కేసుల వివాదంతో ప్రక్రియ నిలిచింది. టెట్ అర్హత ఉన్నవారికి స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లకు అర్హులని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించడంతో ఈ ప్రక్రియకు అడ్డంకిగా మారింది. ఈ అవాంతరాలను అధిగమించి డీఎస్సీ నోటిఫికేషన్ సత్వరమే జారీ చేయాలని, ఉపాధ్యా య ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ప్రమోషన్లు చేపడితే మరిన్ని ఖాళీలు

ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చి అవకాశం కల్పిస్తే క్షేత్రస్థాయిలోని ఎస్జీటీ పోస్టుల్లో ఖాళీలు మరిన్ని ఏర్పడే అవకాశాలున్నాయి. నిర్మల్ జిల్లాలో గతంలో ఉపాధ్యాయ ఖాళీలు 461 ఉండగా ప్రమోషన్లు చేపడితే మరిన్ని ఖాళీలు పెరిగే అవకాశాలున్నట్లు నిరుద్యోగ అభ్యర్థులు పేర్కొంటున్నారు. కోర్టు చిక్కులను పరిష్కరించి ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు 'చలో హైదరాబాద్'

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోని డీఎడ్ బీఎడ్ అభ్యర్థుల సంఘం ప్రతినిధులు 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయాన్ని బుధవారం ముట్టడించనున్నట్లు పేర్కొంటున్నారు. మంగళవారం రాత్రి అభ్యర్థులు రాష్ట్ర రాజధానికి బయలుదేరివెళ్లారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు ముందే రాష్ట్రవ్యాప్తంగా 20వేల ఉపాధ్యాయ ఉద్యోగాలకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతున్నారు. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోష ప్రక్రియ కూడా సత్వరమే పూర్తి చేసి ఏర్పడిన ఖాళీలు ఇందులో కలపాలని అంటున్నారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థులు పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారమని, ఉద్యోగాల కోసం సుదీర్ఘకాలంగా వేచి చూస్తున్నామని పేర్కొన్నారు. డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం జిల్లా ప్రతినిధులు ఆనంద్‌బాబు, తిరుమలేశ్, సురేశ్ తదితరులున్నారు. 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ వచ్చి విజయవంతం చేయాలని కోరుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం



మాట్లాడుతున్న బ్రహ్మానందం

ఆదిలాబాద్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రవాసీ కార్యకర్తల సమావేశంలో గావ్ చలో అభియాన్, బస్తీ చలో అభియాన్ కార్యశాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అభియాన్ జిల్లా కన్వీనర్ ఘటిక క్రాంతి కుమార్, కోకన్వీనర్ మోహన్ అగర్వాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకత్ రమేష్, గంగారెడ్డి, పార్లమెంట్ కోకన్వీనర్ మయూర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, అసెంబ్లీ కన్వీనర్ విజయ బోయర్, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, పట్టణ అధ్యక్షుడు లాలామున్నా తదితరులు పాల్గొన్నారు.